క్లుప్తంగా

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆదోనిసెంట్రల్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదోనిలో (ఎస్‌ఎఫ్‌ఐ–యూటీఎఫ్) నిర్వహించిన మోడల్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బుధవారం బహుమతుల ప్రదానోత్సవం, అభినందన కార్యక్రమాన్ని స్థానిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు, లైబ్రరీ గ్రేడ్ వన్ అధికారి సుజాత, మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, నెహ్రూ స్మారక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హలీంసిద్దిక్ చేతులమీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించాలని, చదువులో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

ఆదోనిరూరల్: ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీఎస్‌ఏసీఎస్) మేనేజర్ కె.మాలిక్, అనిత సూచించారు. ఈ మేరకు బుధవారం ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్, బాబు ప్లాజా ప్రాంతాల్లో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పట్ల కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, ఎలా నివారించుకోవాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కోసిగి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను గురువారం బహిరంగ వేలం వేయనున్నట్లు కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆదేశాల మేరకు కోసిగి, పెద్దకడబూరు స్టేషన్ పరిధిలోని అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ఉదయం 9.30 గంటలకు సెబ్ కార్యాలయం చేరుకుని రూ.3 వేల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. వేలంలో పలికిన మొత్తం నగదుతో పాటు 18 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు కోసిగి సెబ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి బుధవారం రాత్రి టీబీ బోర్డు అధికారులు నీటి సరఫరాను నిలిపి వేశారు. జలాశయంలో నీటిమట్టం అడుగంటుతుండడం, గతంలో నిర్ణయించిన మేరకు డ్యాంలోని ఎల్లెల్సీ హెడ్‌లో అర్ధరాత్రి నుంచి నీటిమట్టాన్ని తగ్గిస్తూ గురువారం ఉదయానికి పూర్తిగా సరఫరా బంద్ చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో ఆంధ్ర పరిధిలో నాలుగు రోజుల పాటు కాలువలో ప్రవాహం ఉంటుందని అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 1586.17 అడుగులతో 7.269 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోనున్నారు. మే నెలలో 10 రోజుల పాటు తాగునీటి అవసరాలకు కాలువకు నీటిని వదిలే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

చింతకుంటకు చేరిన నీరు

ఆలూరు: తుంగభద్ర డ్యాం అధికారులు తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీ కాలువకు విడుదల చేసిన నీరు బుధవారం చింతకుంట వరకు చేరాయి. కేవలం తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని విడుదల చేశారని, రైతులు జలచౌర్యం చేయరాదని అధికారులు సూచించారు.

విజేత యనకండ్ల వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్యస్వామి ఉరుసు సందర్భంగా బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల సైజు వృషభాల బండలాగుడు పోటీల్లో యనకండ్ల వృషభాలు గెలుపొందాయి. పోటీలను వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. 15 జతల వృషభాలు పాల్గొనగా సి.బెళగల్ మండలం, యనకండ్ల తిరుమలేష్, మిట్టసోమాపురం వీరస్వామికి చెందిన ఉమ్మడి జత వృషభాలు విజేతగా నిలిచాయి. రెండవస్థానంలో నంద్యాల జిల్లా డోన్ మండలం, కొచ్చెర్వు చిక్కడు బుల్స్, మూడవ స్థానంలో కొత్తకోట డాక్టర్ గురునాథ్ వృషభాలు, నాల్గవ స్థానంలో ఓబులదేవురపల్లి అంజనేయులు వృషభాలు, తర్వాత స్థానాల్లో పీఆర్ పల్లె బాష్యం నాగేశ్వరయాదవ్, పందికోన లవకుమార్, శ్రీరంగాపురం వినయ్‌కుమార్ వృషభాలు నిలిచినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సాయంతో వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ జగనన్న పాలన

- పెద్దతుంబళంలో అభివృద్ధి పరుగులు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.6 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు
- ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి, శరవేగంగా మిగతా పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



బాషా ఇంటి వద్ద నుంచి దేవమ్మవ్వ ఇంటివరకు నిర్మించిన సీసీ రోడ్డు



పెద్దతుంబళంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు

ఆదోనిరూరల్: గత టీడీపీ హయాంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేది. దీంతో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అన్నిరకాలుగా ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి ఊపందుకుంది. ఆదోని మండలానికి 20 కి.మీ. దూరంలో ఉన్న గ్రేడ్–1 పంచాయతీ పెద్దతుంబళం గ్రామంలో నాలుగున్నరేళ్లుగా అభివృద్ధి పరుగులు తీస్తోంది. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మంచినీటి కుళాయి కనెక్షన్లు, విద్యుత్ స్తంభాలు, శ్మశాన వాటికకు రోడ్లు, దేవాలయాలకు రోడ్లు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ కేంద్రాల నిర్మాణాలు, ఇండోర్ స్టేడియం వంటి పనులను 75 శాతం పూర్తి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది. గ్రామంలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.6 కోట్లతో సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దతుంబళంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు

- పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో బాషా ఇంటి వద్ద నుంచి దేవమ్మవ్వ ఇంటి వరకు సీసీ రోడ్లు నిర్మించారు.
- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో వీరేష్‌బాబు ఇంటి వద్ద నుంచి కౌలుట్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు
- మండల గ్రాంట్ కింద రూ.10 లక్షలతో నెమలికల్ రోడ్డు నుంచి శ్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు
- పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో పాతయ్య ఇంటి వద్ద నుంచి వీరేష్ ఇంటి వరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- మండల గ్రాంట్ రూ.10 లక్షలతో కామవరం రోడ్డు నుంచి తిమ్మప్ప గుడి వరకు గరుసు రోడ్డు, సీసీ కల్వర్టులు
- పంచాయతీ గ్రాంటు రూ.5 లక్షలతో బీసీ కాలనీలో డ్రెయినేజీ కాలువల ఏర్పాటు
- రూ.43.60 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు.
- ఎంపీ గ్రాంటు రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- కాడెక్కిరయ్య ఇంటి నుంచి ఆటో రావూఫ్ ఇంటి వరకు డ్రెయినేజీలు, సీసీ రోడ్లను రూ.10 లక్షలతో నిర్మించారు.
- మాధవరం రోడ్డు నుంచి హైస్కూల్ రోడ్డు వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీ కాలువలను రూ.10 లక్షలతో చేపట్టారు.
- ఎస్సీ స్కూల్ వద్ద సీసీ రోడ్డు, డ్రెయినేజీలను రూ.5 లక్షలతో చేపట్టారు.
- తాయారు ఇంటి నుంచి కురువ గురిలప్ప ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీలను రూ.5 లక్షలతో చేపట్టారు.
- కాపు వీరేష్ ఇంటి నుంచి మసీదు వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీలను రూ.5 లక్షలతో వేయించారు.
- రమేష్ ఇంటి నుంచి బాషా ఇంటి వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీలను రూ.5 లక్షలతో చేపట్టారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4 లక్షలతో పీరా ఇంటి నుంచి ఖాదర్‌బాషా ఇంటి వరకు సీసీ రోడ్లు వేశారు.
- జాయర్ ఇంటి నుంచి మాబమ్మ ఇంటి వరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలను రూ.6 లక్షలతో చేపట్టారు. గౌడ్‌సాబ్ ఇంటి నుంచి దేవమ్మ గుడి వరకు సీసీ రోడ్డును రూ.4 లక్షలతో వేయించారు.
- పేద ఈరన్న ఇంటి నుంచి సిద్ధ నాగేష్ ఇంటి వరకు సీసీ రోడ్డును రూ.2 లక్షలతో వేయించారు.
- ఓంకార్ ఇంటి నుంచి కురువ నరసప్ప ఇంటివరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీలను, గరుసు రోడ్డు పనులను రూ.3.5 లక్షలతో వేయించారు.
- మాధవరం రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు పైపులైన్ కోసం రూ.6 లక్షలు ఖర్చు చేశారు.
- హరి ఇంటి నుంచి మసీదు వరకు సీసీ రోడ్డు రూ.3 లక్షలతో వేయించారు.



బీసీ కాలనీలో నిర్మించిన డ్రెయినేజీ

సంక్షేమ పథకాల పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించిన నగదు వివరాలు

పథకం పేరు	అర్హులైన లబ్ధిదారులు	మంజూరైన నగదు (రూ.లలో)
వైఎస్సార్ పింఛన్ కానుక	997	29,57,000
జగనన్న అమ్మ ఒడి	1299	1,68,87,000
వైఎస్సార్ చేయూత	623	1,16,81,250
జగనన్న చేదోడు	83	8,30,000
ఈబీసీ నేస్తం	9	1,35,000
వైఎస్సార్ కాపు నేస్తం	3	45,000
ఫాస్టర్స్ హనరేరియం	2	20,000
వైఎస్సార్ పెళ్లి కానుక	5	5,00,000
జగనన్న తోడు	101	10,10,000
వైఎస్సార్ వాహనమిత్ర	39	3,90,000
జగనన్న విద్యాదీవెన	119	9,19,450
జగనన్న విద్యాకానుక	62	6,20,000
వైఎస్సార్ బీమా	21	23,00,000
రైతు భరోసా	942	7065000
పీఎం కిసాన్	981	58,86,000
వైఎస్సార్ క్రాప్ ఇన్సూరెన్స్	1696	10888775
సున్నావడ్డీ పంట రుణాలు	35	4103675
క్రాప్ ఇన్సూరెన్స్	566	27,22,661
సీడ్ డిస్ట్రిబ్యూషన్	28	128185
ఫర్టిలైజర్ డిస్ట్రిబ్యూషన్	250	559650
ఇన్‌పుట్ సబ్సిడీ	13	87450
యంత్రసేవా పథకం	5	1500000



నెమలికల్ రోడ్డు నుంచి శ్మశాన వాటిక వరకు నిర్మించిన సీసీ రోడ్డు



ఎంపీ గ్రాంటు రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం

ఇబ్బందులు తొలగాయి



మా కాలనీలో గతంలో సీసీ రోడ్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. మురుగు, వర్షపు నీరు రోడ్లపైనే నిల్వ ఉండేది. దీంతో దోమలు వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లుతుండేది. సీసీ రోడ్డు వేయడంతో ప్రస్తుతం కాలనీ ఎంతో శుభ్రంగా ఉంది. ఇబ్బందులు తొలగాయి. – **శివయ్య, 3వ వార్డు, పెద్దతుంబళం**

సంతోషంగా ఉంది



మా వార్డులో గతంలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఉండేవి కావు. నేడు డ్రెయినేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయడంతో చాలా సంతోషంగా ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేవు. వర్షపు నీరు, సీసీ రోడ్లపై నిలిచిన నీరు డ్రెయినేజీ కాలువల్లోకి వెళ్తున్నాయి. – **ముక్కరమ్మ, 4వ వార్డు, పెద్దతుంబళం**

75 శాతం అభివృద్ధి పనులు చేశాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తాను సర్పంచ్‌గా గెలిచినప్పటి నుంచి గ్రామంలో 75 శాతం అభివృద్ధి పనులను పూర్తి చేశాం. మరో 25 శాతం పనులు మిగిలి ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేస్తాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమైంది. – **ఉచ్చప్ప, సర్పంచ్, పెద్దతుంబళం**

నాణ్యతగా పనులు



పెద్దతుంబళంలో రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాం. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నాణ్యతే ప్రామాణికంగా పనులు పూర్తి చేశాం. మిగిలిన 25 శాతం పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చేసిన పనులపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. – **చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, పెద్దతుంబళం**

నేటి నుంచి ఆశ్రమ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న సిద్ధరూఢ స్వామి

కోసిగి: మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో సద్గురు ఆరూఢ జ్యోతి శాంతాశ్రమంలో వెలసిన సిద్ధరూఢ స్వామి అష్టమ వారికోత్సవం ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు భక్తాదులు తెలిపారు. 22న వేకువజామున స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలపుష్పాలంకరణ, వెండికవచ అలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేసి ఆలయం ప్రాంగణంలో అరూఢ జ్యోతి శాంతాశ్రమ పీఠాధిపతులచే పూజలకు అంకుర్పారణ చేయనున్నారు. అలాగే మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి పీఠాధిపతులచే ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 24వ తేదీన మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ తాలుకా షణ్ముఖరూఢ మఠం ఆరూఢజ్యోతి శాంతాశ్రమ పీఠాధిపతి అభినవ సిద్ధరూఢ మహాస్వామి, ఉరువకొండ గవిమఠ సంస్థాన ఆశ్రమ పీఠాధిపతి సద్గురు కరిబసవేశ్వర మహాస్వామి, సద్గురు ప్రణవానందగిరి స్వామి, స్వరూపనందగిరి స్వామి, గురుచరణానందగిరి మాతాజీ, శివానంద స్వామి, గురు సేవానంద స్వామి, తిప్పయ్యస్వామి హాజరై భక్తులకు ఉపన్యాసం చేయనున్నారు. పూజ కార్యక్రమానికి వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదోనిరూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశాల మేరకు బుధవారం ఈవీఎం యంత్రాల పనితీరుపై బీఎల్‌ఓలు, సెక్టోరల్ ఆఫీసర్‌లకు స్థానిక రెవెన్యూ భవన్‌లో అవగాహన కల్పించారు. డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాల పరిధిలో కల్పిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం 98వ పోలింగ్ కేంద్రం నుంచి 157వ పోలింగ్ కేంద్రంలో ఉన్న బీఎల్‌ఓలకు, సెక్టరల్ ఆఫీసర్‌లకు ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల్లో ఓటర్లు తడబాటుకు గురికాకుండా యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇందుకోసం డెమో ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందన్నారు. మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్లు రాజనాయక్, గోపీనాథ్, రోడ్లు భవన శాఖ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిటీ టౌన్ ప్లానర్ శ్రీనివాసులు, ఎన్నికల సీనియర్ సహాయకులు ఖాసీం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే అమ్మోరు మద్దమ్మ



మద్దమ్మ మూల విరాట్

మద్దికెర: తనను కొలిచే భక్తులను అక్కున చేర్చుకుంటూ వారి కోరికలను నెరవేర్చుతూ అమ్మోరు తల్లి మద్దమ్మగా భాసిల్లుతున్న మాధవీ దేవత (మద్దమాంబ) జాతర ఉత్సవాలను ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 23న రాత్రి 9 గంటలకు లగ్నోత్సవం, 10:20 గంటలకు మాంగల్యధారణ జరుగుతుంది. 24న సాయంత్రం 4 గంటలకు రథం ముందు హోమం , 5:45కు అశేష జనవాహిని మధ్య అమ్మ వారి రథోత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 25న పారువేటతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రంలోనే పెద్ద చెక్క విగ్రహం

6 శతాబ్దాల క్రితం మద్దికెరలో వెలసిన మద్దమ్మ దేవత విగ్రహంలో జీవకళ ఉట్టిపడుతుంది. ఇంత పెద్ద విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదనేది ప్రతీతి. అక్కడున్న మద్ది వృక్షాన్నే విగ్రహంగా చెక్కినట్లు శిలా శాసనాలు చెబుతున్నాయి. దేవత పేరుతోనే మద్దికెరను, మద్దమ్మ కుంటను, మద్దమ్మ బావిని ఏర్పాటు చేశారు. గ్రామంలో చాలా మందికి మద్దమ్మ, మద్దికెరప్ప, మద్దన్న వంటి పేర్లు పెట్టుకుంటుంటారు.

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం, బేతంచెర్ల మండలం రంగాపురం మధ్య గల చిన్నమల్కాపురం ఫారెస్ట్ బీట్‌లో కొండల్లో వెలసిన పాలుట్ల రంగస్వామి ఆలయ సమీపంలో అలనాటి పాలెగాళ్ల నివాస ప్రాంతం కోటపేటలో ఓ సామాన్య భక్తుడు శ్రీరంగాపురానికి చెందిన రామచంద్రారెడ్డి కాశిరెడ్డినాయన స్ఫూర్తితో ఏర్పాటు చేసిన చిన్న ఆశ్రమం ఇప్పుడు ఎందరికో కడుపు నింపుతోంది. ఆశ్రమానికి అనుబంధంగా భక్తుల విరాళాలతో నిర్మించిన కాశిరెడ్డి నాయన ఆలయంలో నేటి నుంచి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. కోటపేట ఆంజనేయ స్వామి, అవధూత కాశిరెడ్డి నాయన 14వ ఆరాధనోత్సవాలు, అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామికి, శ్రీలక్ష్మీ నరసింహ స్వామికి, నవగ్రహ, నాగదేవతల 5వ వార్షికోత్సవం ఈనెల 22వ తేదీన గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గణపతి పూజ, పల్లకీ సేవ, ప్రత్యేక సేవలు, నందికోల సేవ, జ్యోతిజ్వాల, అన్నదాన కార్యక్రమాలున్నాయన్నారు. చెక్కభజన, కట్టె కోలన్న, పంచమాంకములు నాటక ప్రదర్శన ఉన్నాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

27న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

ఆదోనిసెంట్రల్: ఏప్రిల్ 27వ తేదీన పాలిటెక్నిక్ కామన్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి గానూ రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ డిప్లమో కోర్సుల్లో ప్రవేశం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి పూర్తయిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5 చివరి తేదీ అని తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, దగ్గర్లోని ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79016 20203 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

23న పర్యావరణ విద్యపై పరీక్ష

కౌతాళం: పర్యావరణ విద్యపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల మేరకు ఈనెల 23న శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం

ఆదోనిఅర్బన్: ఈనెల 25వ తేదీన అవోపా ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు అవోపా సభ్యులు నగేష్ కాకుబాళ్ బుధవారం తెలిపారు. ఆదోని పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని, ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో రక్తనాళాల సర్జన్ కన్సల్టేషన్ పాటు, రూ.4500 విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 73373 21810, 73373 21806 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

మద్దికెర: నాటుసారా తయారుచేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. మండలంలో గత రెండు రోజులుగా సిబ్బందితో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి దాదాపు 1500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, అలాగే 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా సారా తయారీ మానుకోవాలని లేదంటే కేసులు నమోదు చేయడమే గాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని పాత బోదెపాడు గ్రామంలోని పంట పొలాల్లో దాచిన కర్ణాటక మద్యంను సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో గోనెగండ్ల పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. బోదెపాడు గ్రామానికి చెందిన బోయ మహేష్ కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని అక్రమంగా తెచ్చుకొని బోదెపాడు గ్రామ సమీపం పంట పొలంలో దాచి ఉంచాడు. దీనిపై అందిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం సిబ్బందితో వెళ్లి దాడులు చేయడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో 6 బాక్సుల్లో 540 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను (90ఎంఎల్) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



అవార్డులను అందుకున్న వలంటీర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరవేస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ అమరేష్ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సేవా వజ్ర పురస్కారం ఒకరికి, సేవారత్న పురస్కారం ఐదుగురికి, 352 మంది వలంటీర్లను సేవామిత్ర అవార్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు మాట్లాడుతూ.. ప్రజలకు ఇళ్ల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని వివరించారు. గతంలో తెలుగుదేశం సానుభూతి పరులకు మాత్రమే పథకాలు అందేవని అలాంటి పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, ప్రాంతీయ, రాజకీయ వర్గ విభేదాల్లేకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల ప్రధాన భూమిక ఉందన్నారు. సర్పంచ్ పాల్‌దినకర్, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో–ఆప్షన్ మెంబర్ మహబూబ్ సాబ్, కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరేసనరెడ్డి, చెన్నప్పధని పలువురు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

కమనీయం.. చెన్నకేశవస్వామి కల్యాణం



వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.ప్రదీప్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మి కొలుట్ల చెన్నకేశవస్వామి వారి కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అశేష భక్తజన సమూహం నడుమ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, దేవస్థానం ఈఓ బి.చంద్రశేఖర్ రెడ్డి, దేవనకొండ సీఐ శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ చైర్మన్ హనుమంతరెడ్డి, చంద్రకళ దంపతులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వదొడ్డి ప్రేమనాథరెడ్డి దంపతులు కళ్యాణం జరిపించారు. మంత్రాలయం వైఎస్సార్‌సీపీ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ వై.గిరిజమ్మ, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సతీమణి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, శివ స్వాములు కొలుట్లస్వామి మాలధారులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న పి.కోటకొండ గ్రామానికి చెందిన చల్లా బంగారయ్యస్వామి కుమారుడు చల్లా బాలమురళీ స్వామి, మహరాజ గోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందించారు. దేవదాయశాఖ వారు చల్లా బాలమురళి దంపతులను సన్మానించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఉద్యోగులు, కమిటీ మెంబర్లు వెంకటేశ్వరరెడ్డి, మహాలింగడు, చాకలి లక్ష్మన్న, మంగలి చంద్రయ్య, కోటకొండ మీసుగ కృష్ణ, పెద్దలింగన్న, చెల్లిచెలిమల నారాయణ, పండితులు విద్యాధర స్వామి, పులికొండ స్వామి, కానాల గిడ్డయ్య, పూలన్న, పోలీసులు పాల్గొన్నారు.